
పాస్ పేరుతో పైసా వసూలు


2


2

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి




AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## లక్కంపల్లి లిఫ్ట్ ఛైర్మన్‌గా నారాయణ రెడ్డి



**అక్షరటుడే, నందిపేట్ :** లక్కంపల్లి లిఫ్ట్ ఛైర్మన్‌గా నారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం లక్కంపల్లిలో జరిగిన లిఫ్ట్ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్‌ఛైర్మన్‌గా శ్యామ్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సాగునీటి సరఫరాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తామని తెలిపారు. లక్కంపల్లి, పరిసర ప్రాంతాల రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని ప్రకటించారు.





## ప్రభుత్వ బడుల అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

**అక్షరటుడే, కామారెడ్డి:** 'మా ఊరు - మన బడి' కార్యక్రమంలో భాగంగా గ్రామసభ తీర్మానం చేసి ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులను ప్రభుత్వ బడికి చేర్పించిన తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలో కొత్త వివాదం చెలరేగింది. ఒకప్పుడు 108 మంది మాత్రమే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నేడు దాదాపు 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. తమ ఆదాయానికి గండి పడుతుందని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు కుట్రలు చేస్తున్నాయని సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి ఆరోపించారు. గ్రామంలో చిచ్చు పెట్టడమే కాకుండా తమపై తప్పుడు ఫిర్యాదులు చేయించి, తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయించారని తెలిపారు. నలుగురి ఫిర్యాదు మేరకు పోలీసులు తమను పిలిపించి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం పంచాయితీ ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వ బడుల అభివృద్ధిని అడ్డుకునే ఎలాంటి కుట్రలనైనా తిప్పికొడతామని హెచ్చరించారు. తమ పాఠశాలల ఉనికి కోల్పోకుండా ఉండేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు కొత్తరకం కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు 'ఫైనల్' తిప్పలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గృహప్రవేశాలు కూడా చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులకు మరికొన్ని నిధులు సమీకరించుకుని ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. అయితే ఇప్పటివరకు కట్టిన ఇళ్లకు ఫైనల్ బిల్లు రాకపోవడంతో లబ్ధిదారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి



- చివరి బిల్లు విడుదల చేయని ప్రభుత్వం
- జిల్లాలో 2,457 ఇళ్ల నిర్మాణం పూర్తి
- బిల్లు కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- కేంద్రం వాటా రావాల్సి ఉందంటున్న అధికారులు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 11,609 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 2,457 ఇళ్లు పూర్తి కాగా గృహప్రవేశాలు కూడా జరిగిపోయాయి. అయితే ఇళ్లు కట్టుకుని గృహప్రవేశాలు చేసినా చేతికి ఫైనల్ బిల్లు అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్న వారు నిధుల కోసం నానా అవస్థలు పడుతున్నారు. మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

### రూ.259.36 కోట్లు ఇప్పటివరకు చెల్లింపు

పూర్తయిన ఇళ్లకు మూడు విడతల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసింది. ఇప్పటివరకు విడతల వారీగా రూ.259.36 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఉపాధి హామీ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులు కూడా దశలవారీగా అందుతాయని వివరించారు. మూడు విడతల బిల్లుల విడుదలలో పెద్దగా ఇబ్బంది లేదు. అసలు సమస్య ఫైనల్ విడత చెల్లింపుతోనే మొదలైంది. ఇల్లు పూర్తయినా చివరి విడత నగదు చేతికి అందకపోవడంతో చాలామంది అప్పులు తీర్చలేని పరిస్థితి. 'ఇల్లు కట్టేశాం. సిమెంట్, ఇనుము కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోతోంది. ఫైనల్ బిల్లు ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు' అని లబ్ధిదారులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదలయ్యాయని అధికారులు చెబుతున్నా, కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయిందని తెలుస్తోంది.

### కేంద్రం, రాష్ట్రం కలిపి రూ.1.20 లక్షలు..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి చివరి విడతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తాయి. ఇందులో కేంద్రం వాటా రూ.72 వేలు, రాష్ట్రం వాటా రూ.48వేలు ఉంటుంది. దీనికి అదనంగా ఉపాధి హామీ పథకం కింద రూ.27వేలు, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు చెల్లిస్తారు. ఫైనల్ బిల్లులు ఆలస్యం కావడంతో ఇప్పటికే పనులు ప్రారంభించిన 9,635 మంది లబ్ధిదారులు కూడా నిధులు లేక నిర్మాణాలను నిలిపివేస్తున్నారు. ఇటుక, ఇసుక, కూలీలకు డబ్బులు ఇవ్వలేక పనులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. దీంతో పథకం లక్ష్యం గాడితప్పే ప్రమాదం ఉంది.

### కేంద్రం నిధులు రావాలి

**- విజయపాల్ రెడ్డి, హౌసింగ్ పీడీ, కామారెడ్డి**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మొదటి విడతలో 11,609 ఇళ్లకు గాను 2,457 ఇళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఇల్లు పూర్తయిన వారికి ప్రభుత్వం రూ.3.41 లక్షల చొప్పున చెల్లించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.1.20 లక్షలు ఇవ్వాల్సి ఉంది.

## పలు డివిజన్లలో కమిషనర్ తనిఖీలు



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పలు డివిజన్లలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. నగరంలోని 3,19,43, 18 డివిజన్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను, రహదారుల పరిస్థితిని పరిశీలించారు. గుంతలు ఏర్పడిన రహదారులకు వెంటనే వెట్ మిక్స్ ద్వారా మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుధ్య పనులు నిరంతరాయంగా చేపట్టాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



## తెలంగాణలో రోడ్డు భద్రతకు కేంద్రం పెద్దపీట : అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా చర్యలకు సంబంధించి తాను లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇచ్చిన సమాధానంలో కీలక వివరాలు వెల్లడయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణలో గత కొన్నేళ్లలో ప్రమాదాల ఆధారంగా మొత్తం 1,513 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 1,308 బ్లాక్ స్పాట్లకు సంబంధించిన శాశ్వత నివారణ చర్యలు పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని అర్వింద్ తెలిపారు. మరో 205 బ్లాక్ స్పాట్లలో శాశ్వత నివారణ చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 78 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 75 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 3 ప్రాంతాల్లో చర్యలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

## కేకేవై రహదారిపై వంతెన నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, లింగంపేట:** కేకేవై రహదారిపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు గురువారం భూమిపూజ చేశారు. గతేడాది భారీ వర్షాలకు లింగంపల్లి కుర్దు వద్ద వంతెన కొట్టుకపోయింది. వంతెన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అనేకమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.4 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణాన్ని నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ బ్రిడ్జి పూర్తయిన అనంతరం లింగంపల్లి ఖుర్ద్ పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. త్వరగా అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరారు.

## 'చాగంటి' రాకకు ఏర్పాట్లు పూర్తిచేయాలి..




**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఇందూరు గోసేవ సమితి ఆధ్వర్యంలో నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న 'గోమాత వైభవం' ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రముఖ ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వస్తున్నారని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులకు సూచనలు చేశారు. చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను వినేందుకు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత వంటి మౌలిక వసతులను సమకూర్చాలని ఆదేశించారు. భక్తులు క్రమశిక్షణతో కార్యక్రమానికి హాజరై చాగంటి ఆధ్యాత్మిక ప్రవచనాలను ఆస్వాదించి 'గోమాత వైభవం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలుచేయాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మహిళా రిజర్వేషన్ బిల్లును డిలిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని వామపక్ష మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. నాందేవాడలోని ఐద్వా ఆఫీసులో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వామపక్ష మహిళా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సంధ్యారాణి, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సుప్రియ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి స్వరూపరాణి మాట్లాడారు. 33శాతం మహిళా బిల్లుకు ఆమోదం లభించినప్పటికీ డిలిమిటేషన్‌తో ముడిపెట్టి వాయిదా వేయడం మహిళలకు అన్యాయం చేయడమేనన్నారు. గోదావరి, అనిత, రజియా, శ్రీదేవి, మాధవి, మాజిత, సంజన, లక్ష్మి, సురేఖ పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌తో శాంతి భద్రతలు బలోపేతం




**అక్షరటుడే, కామారెడ్డి:** విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్ ద్వారా శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ రాజేష్ చంద్ర అధికారులను ఆదేశించారు. జిల్లాలో వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది పనితీరును సమీక్షించారు.

### స్టేషన్‌లో క్షుణ్ణంగా పరిశీలన

పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం యూనిఫాం టర్నౌట్‌ను పరిశీలించి స్టేషన్ రిసెప్షన్, లాకప్, బ్యారెక్స్, టెక్నికల్ రూమ్, రికార్డులు, కేసుల దర్యాప్తు, సీజ్ వాహనాలు, క్రైమ్ హాట్‌స్పాట్ల వివరాలను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసుల పురోగతిపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసం, భరోసా పెరిగేలా పనిచేయాలని సూచించారు. పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచి ముందస్తు నేర నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి సీసీఎన్టీఎస్ వ్యవస్థను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే గణేష్ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, మండపాల వద్ద భద్రత, కమిటీలతో సమన్వయంతో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ముందుగానే రూపొందించాలన్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమమే బీఎంఎస్ ధ్యేయం : ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా బీఎంఎస్‌ను ప్రారంభించారని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని నిజామాబాద్ డిపో-2లో జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోకమాన్య బాల గంగాధర్ తిలక్ జయంతి రోజున దత్తోపంత్ తెంగడి బీఎంఎస్‌ను స్థాపించారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే కార్మికుల హక్కులు, దేశ ప్రయోజనాలు ముఖ్యమనే సిద్ధాంతంతో పనిచేస్తుందన్నారు. దేశంలో సభ్యత్వం పరంగా అతిపెద్ద కార్మిక సంఘాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం సంతోషకరమన్నారు. ప్రధానంగా 'వికసిత్ భారత్' నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమని, శ్రమకు గౌరవం ఇవ్వడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. దేశానికి రైతు అన్నం పెడితే కార్మికుడు దేశాన్ని నిర్మిస్తాడని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు శ్రావణ్, మఠం పవన్, జ్యోతి మురళి, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయరెడ్డి, శ్రీనివాస్ చారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి కుమార్, ఆర్టీసీ కార్మిక సంఘం ప్రతినిధులు కేబీ సింగ్, సరోజ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌కు చేరిన ఉద్యోగుల 'జన జాగరణ యాత్ర'




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్' చేపట్టిన 'జన జాగరణ యాత్ర' 12వ రోజు నిజామాబాద్ నగరానికి చేరుకుంది. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు ఉద్యోగులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తాను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, విక్రమ్ సింగ్, గోపాల్, మోహన్ రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని కళాశాలను సీజ్ చేయాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అనుమతులు లేకుండా నడుస్తున్న నారాయణ కళాశాలను వెంటనే సీజ్ చేయాలని టీజీవీపీ, యూఎస్ఎఫ్ఐ, ఏఐఎఫ్డీఎస్ నాయకులు కళ్యాణ్, పెద్ది సూరి, రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఐఈవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కేశాపూర్ వద్ద అనుమతులు లేకుండా విద్యార్థులను ఒక భవనంలో ఉంచుతూ వారి భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థులను ఖాళీ చేయించాలని అధికారులు ఆదేశించినా యాజమాన్యం స్పందించకపోవడం శోచనీయమన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2 | నిజామాబాద్/కామారెడ్డి | గురువారం | 23.7.2026

www.aksharatodaynews.com

AKSHARA TODAY

## భీమ్‌గల్ మండల సమస్యలపై పీసీసీ చీఫ్‌కు వినతి




**అక్షరటుడే,భీమ్‌గల్ :** మండలంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల సర్పంచులు, కౌన్సిలర్లు గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తహశీల్దార్ కార్యాలయ నిర్మాణం, రహదారుల దుస్థితి, మినీ స్టేడియం నిర్మాణం, వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనుల పురోగతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందిస్తూ.. 100 పడకల ఆస్పత్రి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి మండలంలోని ప్రధాన రహదారుల గుంతలను పూడ్చి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లె లక్ష్మణ్, అరిగెల జనార్ధన్, భూక్య రమేష్, కౌన్సిలర్లు అంజుమ్, గట్టు సతీష్, సందీప్, సంగ్యా నాయక్, రాగుల మోహన్, శ్రీధర్ గౌడ్,వాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి కల నెరవేరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య-భూమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

> 'డిగ్రీ పట్టా' పొందడం అనేది సగటు విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన ఘట్టం. ఉన్నత చదువులకు వెళ్లాలన్నా, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హతకు, అలాగే ప్రైవేట్ ఉద్యోగాన్ని సాధించాలన్నా డిగ్రీ పట్టా తప్పనిసరి. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, ఆరోగ్య కారణాలతో డిగ్రీ పూర్తి చేయలేకపోయిన వారు ఎంతో మంది ఉన్నారు.
>
> - అక్షరటుడే, తెయూ క్యాంపస్



# పాస్ పేరుతో 'పైసా వసూల్'

■ తెలంగాణ యూనివర్సిటీలో 'వన్ టైం ఛాన్స్' పేరుతో అడ్డగోలుగా వసూళ్లు ■ ఏళ్లుగా దందా సాగుతోందనే ఆరోపణలు

ఏళ్లు గడిచినా డిగ్రీ పాస్ కాలేకపోయామననే మనసులో ఒక వెలితి అలానే ఉండిపోతుంది. అలాంటి వారి ఆశలను గుర్తించి యూనివర్సిటీలు మళ్లీ డిగ్రీ పూర్తి చేసేందుకు 'వన్ టైం ఛాన్స్' పేరుతో ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తాయి. ఏళ్లక్రితం నిలిచిపోయిన చదువును మళ్లీ పూర్తి చేసి, సమాజంలో గౌరవంగా బతికేందుకు ఇది ఒక గొప్ప అవకాశం. అయితే, ఈ 'చివరి అవకాశాన్ని' ఎలాగైనా సద్వినియోగం చేసుకోవాలనే అభ్యర్థుల బలహీనతను, ఆశను కొందరు అక్రమార్కులు వ్యాపారంగా మార్చుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న ఈ 'వన్ టైం ఛాన్స్' పరీక్షల వెనుక అక్రమాలు, దళారుల దందా, యూనివర్సిటీ పరీక్షల విభాగంలోని సిబ్బంది పాత్రపై అనేక ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

### రూ.వేలల్లో వసూళ్లు..

తెలంగాణ యూనివర్సిటీ లో జరుగుతున్న డిగ్రీ వన్ టైం ఛాన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం కోసం అభ్యర్థులు ఎంతటి ఖర్చుకైనా సిద్ధపడుతున్నారని తెలుసుకున్న కొందరు దళారులు రంగంలోకి దిగారు. ఒక్కో అభ్యర్థి నుండి ఉత్తీర్ణత హామీ కోసం రూ. 30వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని సెమిస్టర్ పేపర్లు ఉన్నాసరే పరీక్షలకు హాజరైతే చాలు. మిగిలిన వ్యవహారమంతా తాము చూసుకుంటామని నమ్మబలుకుతున్నారు.

### పరీక్షల విభాగం పాత్ర?

యూనివర్సిటీలోని పరీక్షల విభాగం ఓ ఉద్యోగి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం నడుస్తోందని చాలాకాలంగా వినిపిస్తోంది. దళారులతోనే ఈ వ్యవహారం ముగిసిపోలేదు. యూనివర్సిటీ పరీక్షల విభాగంలోని ఉద్యోగుల సహకారం లేకుండా పెద్దఎత్తున దందా జరగడం అసాధ్యమనే అనుమానం వ్యక్తమవుతోంది. పరీక్షల విభాగంలోని ఓ ఉద్యోగి, మరో ఇద్దరు సిబ్బంది కనుసన్నల్లోనే ఈ పర్వం కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పీజీ, బీఈడీ.. ఇతర పరీక్షల్లో పాస్ చేయిస్తామని డబ్బుల వసూళ్ల పర్వం చాలా కాలంగా సాగుతోందని యూనివర్సిటీలో బహిరంగ రహస్యమే.

### కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై ఆరోపణలు

ఇందులో కొందరు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా మధ్యవర్తులుగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్షల ప్రక్రియను, మార్కులను పర్యవేక్షించాల్సిన ఆడిట్ సెల్ విభాగంలోని సిబ్బంది కూడా ఈ దందాలో భాగస్వామ్యం ఉందనే ప్రచారం జరుగుతోంది. అభ్యర్థుల నుంచి దళారులు డబ్బులు సేకరించి, తమ వాటా ఉంచుకుని, మిగిలిన మొత్తం పరీక్షల విభాగంలో అప్పగిస్తున్నారని సమాచారం.

### విద్యా వ్యవస్థకు చేటు

తెలంగాణ యూనివర్సిటీలో విద్యను వ్యాపారంగా మార్చారానే విమర్శలు తీవ్రమయ్యాయి. కష్టపడి పరీక్షలకు సిద్ధమయ్యే ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఈ విధానం తీవ్ర అన్యాయం చేస్తోంది. ఈ తరహా వ్యవహారం విద్యా వ్యవస్థ పునాదులకే ప్రమాదకరం. ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి ఈ విషయంలో తక్షణమే స్పందించి తెలంగాణ యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడేందుకు విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వీధిలో ఉన్న దక్షిణముఖి ఆంజనేయస్వామి ఆలయంలో అఖండ రుద్రాభిషేకం విజయవంతంగా పూర్తయింది. 72 గంటల పాటు భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగుండాలని సంకల్పంతో 72 గంటల పాటు అఖండ రుద్రాభిషేకం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేశారు. మూడురోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితులు, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారని నిర్వాహకులు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు



**అక్షరటుడే,కోటగిరి:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ ఘటన పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారని వారు ఆరోపించారు. ఉదయం వేళల్లో సైతం ఇసుక రవాణా చేస్తుండడం వల్ల పొలాలకు వెళ్లే రైతులకు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. పరిమిషన్లు లేకుండా ఇసుక రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. కొడిచర్ల గ్రామం నుండి ఇసుక కల్లూరు మీదుగా తరలిస్తుండడంతో రోడ్లు పాడవుతున్నాయని, బ్రిడ్జిలు కూలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక రవాణాను నిలిపివేయాలని కల్లూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ఘనంగా పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**అక్షరటుడే,కోటగిరి :** డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను కోటగిరి, పోతంగల్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో, కోటగిరి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భాస్కర్‌రెడ్డి కటౌట్లను ఏర్పాటు చేశారు. కేకులు కట్ చేసి పంచిపెట్టారు. పటాకులు కాల్చారు. కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న వ్యక్తి భాస్కర్ రెడ్డి అన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

## కిసాన్‌నగర్‌లో మహిళా భవనం నిర్మాణ పనులకు శ్రీకారం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్‌లో మహిళా భవనం నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ రామరాజు గౌడ్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ రూ.10 లక్షల నిధులతో మహిళా భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవనం పూర్తయిన అనంతరం మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చాట్ల నరేష్, కపిల్, గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు షేక్ రహీముద్దీన్, ప్రసాద్ రావు, శరత్, ఉప సర్పంచ్ స్వామి, ఐకేపీ సీసీ సుష్మ, మహిళా సంఘాల బాధ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



**అక్షరటుడే: బోధన్ :** రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల పట్ల నిరంకుశంగా వివరిస్తుందని నాయకులు విమర్శించారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** రాహుల్‌గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్యామప్ప పటేల్ ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ కావడంతో విద్యార్థుల భవిష్యత్‌ను కేంద్ర ప్రభుత్వం చీకట్లోకి తోసేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీపై బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, సర్పంచులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన వినయ్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో, ఆలూర్ మండలంలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను గురువారం ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. 'సర్' వివరాలను తహశీల్దార్‌ను అడిగి తెలుసుకుని బీఎల్ఏలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆలూర్ బూత్‌లో 95శాతం ఎస్ఐఆర్ ఎన్‌రోల్‌మెంట్ చేసిన సందర్భంగా బీఎల్ఏ లావణ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, వెంకటరామిరెడ్డి, నర్మే నవీన్, గోనె రఘు, మండల కాంగ్రెస్ నాయకులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## కిసాన్‌నగర్ భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం





**అక్షరటుడే, బాల్కొండ:** తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అందిస్తున్నట్లు బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. కిసాన్ నగర్‌లోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం, గురువారం నిపుణులైన ఫిజియోథెరపిస్టుల పర్యవేక్షణలో ఉచిత చికిత్సలు అందిస్తూ, పిల్లలకు అవసరమైన వ్యాయామాలను నేర్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన శిక్షణ అందించేందుకు ప్రత్యేకంగా ఐఈఆర్‌పీలను నియమించినట్లు చెప్పారు. దివ్యాంగ విద్యార్థులతో పాటు వారితో వచ్చే ఒక సహాయకుడికి కూడా ప్రభుత్వం రవాణా ఖర్చులను భరిస్తోందని, అలాగే విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సహాయక పరికరాలను కూడా ఉచితంగా అందజేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ రాజ నర్సయ్య, ఫిజియోథెరపిస్ట్ అఖిల, సీజీవీ గంగాజమున, విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఆందోళన



**అక్షరటుడే, బాల్కొండ:** రాహుల్ గాంధీ వైఖరిని నిరసిస్తూ మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి శివాజీ చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్ మాట్లాడుతూ, దేశ భద్రత, పార్లమెంట్ వ్యవహారాలు, న్యూఢిల్లీలో జరిగిన నిరసనల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ వ్యవహార శైలిని విమర్శించారు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతంగా రాజకీయాలు చేయాలని సూచించారు. నిరసన సందర్భంగా రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగా గౌడ్, సాయికిరణ్, నక్కల గణేష్, తోట చిన్నయ్య, సాయికార్తీక్, ఆరెపల్లి నర్సయ్య, కళ్లెం సుధాకర్, బూసం సత్యనారాయణ, కాల రవి, కడ్తాల్ రాజేశ్వర్, ఐరా ప్రవీణ్, భూమేష్, సుంకం శ్రీనివాస్, ఆరెపల్లి రవీందర్, తోట నవీన్, నాగరాజు, తోట నాగేష్, తోపారం అశోక్, ఉట్నూర్ రాంకిషన్, కన్నా రెడ్డి, దుద్దెల దేవేందర్, జక్కం శ్రీకాంత్, దీకొండ రాజు, చెల్మెల రమేష్, సోన్న పోశెట్టి, నానం నరేష్, కాల బాబు, అడ్వాల గంగాధర్, మద్దుల రమేష్, అగ్గు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమ్మర్‌పల్లి హెల్త్ సూపర్‌వైజర్ ఆకుల మారుతి పేర్కొన్నారు. ధర్మోరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు వాటి నివారణపై హెల్త్ సూపర్‌వైజర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిశుభ్రత, శానిటేషన్‌పై వివరించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించి వాటి పరిశుభ్రతపై తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం దీప, ఆశావర్కర్ పద్మ, హెచ్ఎం రఘునందనాచారి పాల్గొన్నారు.